మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం
12 అక్టోబర్ 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

# తేగడలో వైభవంగా విజయదశమి నవరాత్రి ఉత్సవాలు.

- శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ..
ఆలయ ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.

**చర్ల అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలో ఆదివారం శ్రీ విఘ్నేశ్వర ఆలయం వద్ద శ్రీ విజయదశమి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతలు, పెద్దలు, పిల్లల సహకారంతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో కళకళలాడాయి. బతుకమ్మ సంబరాలు గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపాయి. గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు, పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. శ్రీ విఘ్నేశ్వర ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, దాతలు తమ వంతు సహకారం అందించడంతో ఉత్సవాలు సజావుగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని, పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయి. గ్రామ పెద్దలు, యువత, చిన్నారులు కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ విజయదశమి నవరాత్రి మహోత్సవాలు, బతుకమ్మ సంబరాలతో తేగడ గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు, గ్రామస్తుల సందడితో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.







# సత్తుపల్లిలో ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ.




- స్వాతంత్ర్య సమరయోధుడు,ఎతెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత బాపూజీ సేవలు చిరస్మరణీయం.
- విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి.
- ప్రజాసేవలో బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు.

**సత్తుపల్లి అక్టోబర్ 11 మీ వార్త అర్ సి:**

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం సత్తుపల్లి పట్టణంలో ఘనంగా జరిగింది. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన బాపూజీ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆవిష్కరించారు. అనంతరం బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరంలో, తెలంగాణ ఉద్యమంలో పోషించిన చారిత్రక పాత్రను స్మరించుకున్నారు. ప్రజల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజానాయకుడు బాపూజీ అని కొనియాడారు.ంతెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం త్యాగం చేసిన ఆయన పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయపడ్డారు.

భావితరాలకు స్ఫూర్తిగా బాపూజీ విగ్రహం. సత్తుపల్లి పట్టణ నడిబొడ్డున ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయగలరు.

# తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ తీవ్ర విమర్శలు

**కరకగూడెం అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రచారానికే ప్రజాధనాన్ని ఎక్కువగా వాడుతోందని కరకగూడెం బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన స్మార్ట్ (పీవీసీ) రేషన్ కార్డుల ముద్రణ, పంపిణీ తీరుపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. ఒక్కో స్మార్ట్ కార్డు ముద్రణ, పంపిణీ కోసం ప్రభుత్వం రూ. 18 నుండి రూ. 20 వరకు ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, ఆ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ల ఫోటోలను ముద్రించుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. సొంత ప్రచారం కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని విమర్శించారు. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా అందించే బియ్యం సబ్సిడీ విషయంలో కేంద్ర ప్రభుత్వ సింహభాగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద పీడీఎస్ (గ్రాణా) ద్వారా ఇచ్చే సాధారణ బియ్యానికి కేంద్ర ప్రభుత్వమే దాదాపు 80% నుండి 90% వరకు నిధులు (సబ్సిడీ) భరిస్తోందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం భరించేది కేవలం 10% నుండి 20% వరకు నిధులు (రవాణా, నిర్వహణ సన్నబియ్యం మార్పిడికి అయ్యే వ్యత్యాస ఖర్చులు) మాత్రమేనని వివరించారు. ఒక్కసారే రూ. 18 ఖర్చుపెట్టి కార్డులపై తమ ఫోటోలు వేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతి నెలా రేషన్ బియ్యంలో దాదాపు 90% వరకు ప్రధాన వాటాగా భారీ సబ్సిడీ అందిస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోను కనీసం రేషన్ దుకాణాల్లో కూడా పెట్టకపోవడం నీచ రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇస్తున్న బియ్యాన్ని తామే ఇస్తున్నట్లుగా ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని, రేషన్ దుకాణాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు, ప్రధానమంత్రి కి తగిన ప్రాధాన్యం, గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రతినిధి శ్రీరామచంద్రయ్య, పార్టీ నాయకులు పూణెం శంకరయ్య, పోలబోయిన కృష్ణ, జాడి సమ్మయ్య, నందిగామ ప్రసాద్ చారి, బొల్లికొండ రవికిరణ్, గొగ్గల శ్రీను, సత్యం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కోలాటం కర్రలను వితరణగా అందజేసిన వెగ్గలం సత్యనారాయణ.



**కామేపల్లి అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**

బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొంటున్న మహిళలకు మండల కేంద్రమైన కామేపల్లికి చెందిన వెగ్గలం సత్యనారాయణ ఆది వారం కోలాటం కర్రలను వితరణగా అందజేశారు.

ఎన్టీఆర్, ఇందిరా గాంధీ, గ్రామపంచాయతీ కార్యాలయం, రామకృష్ణాపురం అభయాంజనేయ స్వామి ఆలయం, కామేపల్లి శివాలయం వీధి, గోపాలపురం, కామేపల్లి కాలనీలో మొత్తం 7 సెంటర్లలో బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొన్న మహిళలకు కోలాటం కర్రలను వితరణగా అందజేశారు.స్థానిక సర్పంచ్ అజ్మీర బుల్లి హరినాయక్ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ డైరెక్టర్ అంతోటి అచ్చయ్య,

అజ్మీర రాజు నాయక్,మాజీ సర్పంచ్ అజ్మీర అర్జున్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ రాయల లక్ష్మయ్య, మహిళలు,యువజనులు కన్నమాల రాంబాబు, కామా వెంకన్న, కన్నమాల వెంకటేశ్వర్లు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత కు పట్టు వస్త్రాలు సమర్పించిన వెగ్గలం సత్యనారాయణ.



**కామేపల్లి అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా దుర్గామాతకు మండల కేంద్రమైన కామేపల్లికి చెందిన వెగ్గలం సత్యనారాయణ ఆది వారం పట్టు వస్త్రాలను ఉత్సవాల నిర్వాహకులకు అందజేశారు.స్థానిక ఎంపీ సెంటర్ లోని దుర్గామాతకు 12 రోజులు గాను 12 పట్టు వస్త్రాలను సత్యనారాయ ణ అందజేయడం జరిగింది. దీంతో నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించిన సత్యనారాయణ కు కృతజ్ఞతలు తెలిపారు.

## సింగరేణి లో లాభాల వాటాను ప్రకటించాలంటూ సీఐటీయూ ఆందోళన.



- పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల.

**సత్తుపల్లి అక్టోబర్11మీ వార్త అర్ సి:**

సింగరేణిలో రివ్యూ సమావేశం జరిగినప్పటికీ లాభాల వాటాలు యాజమాన్యం నేటికి ప్రకటించక పోవడానికి ఆగ్రహం వ్యక్తం చేసిన సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆదివారం ఉదయం జెవిఆర్ ప్రాజెక్ట్ కార్యాలయం ఓపెన్ కాస్ట్ వీధిలో ప్లకార్డులు చేత బూని దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ నిరసన తెలిపారు.అనంతరం సత్తుపల్లి బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు గాదె సపంత్,ముత్యాల కార్తీక్ ల అధ్యక్షతన జరిగిన నిరసన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ లాభాల వాటాలు యాజమాన్యం ప్రకటించకుండా చేస్తున్న తత్సారాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించే పోరాటాలలో సంఘాలకతీతంగా కార్మికులు తరలి రావాలని అప్పుడే అందరికి న్యాయం జరుగుతుందని సూచించారు. బతుకమ్మ పండుగ సంబరాలు ఆరంభం అయ్యాయని మరి కార్మికులెప్పుడు లాభాల వాటాల సంబరాలు అని యాజమాన్యాన్ని విఠల్ ప్రశ్నించారు.చీటికీ మాటికి పాలాభిషేకాలు చేసే నాయుకులెక్కడ ఉన్నారో నిద్ర లేవాలని నిజంగా కార్మికులపై చిత్త శుద్ధి ఉంటే యాజమాన్యానికి మోకరిల్లకుండా ప్రశ్నించాలని ఎద్దేవా చేశారు.కార్మికుల చెమట చుక్కల శ్రమతో లాభాలు ఆర్జిస్తూ కార్మికులకిచ్చే లాభాల వాటా విషయంలో మౌనం పై అనుమానం వ్యక్తం చేశారు.అంతే కాకుండా 12 వ వేజ్ బోర్డు కమిటి కానరావడం లేదని,సొంతింటి కల కలగానే ఉందని,సంస్థ బకాయిల చెల్లింపులో ఆలస్యమేమని, మారుపేర్ల పరిష్కారానికి చొరవ లేదని, ఇన్ వాలిడేశన్ పెంపుదల ఊసే లేదని విఠల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షురాలు మాచర్ల స్ఫూర్తి, గిద్దయ్యా, ప్రకాష్, రంగారావు, మంగరాజు, వినోద్, రమేష్, త్రినాథ్, దేగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 14 నుంచి 30వ నెహ్రూకప్.

భద్రాచలం అక్టోబర్ 12 మన మీ వార్త:

భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాకరంగా నిర్వహించే నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ఈ ఏడాది నవంబర్ 14 నుంచి నవంబర్ 22 వరకు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, వాతాడి దుర్గా అశోక్ తెలిపారు. భద్రాచలంలో ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో ఈ ఏడాది క్రికెట్ టోర్నమెంట్ షెడ్యూల్ వెల్లడించారు.. 1994 నుంచి నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతోందని ఈ ఏడాది 30వ సారి కూడా నెహ్రూ కప్ జరుపుతామని పేర్కొన్నారు. విజేతకు రూ.60,000వేలు, రన్నర్స్ కు రూ.40,000 వేలు మరియు ట్రోఫీలు, వ్యక్తిగత అవార్డులు అందజేయడం జరుగుతుందని వెల్లడించారు

టోర్నమెంట్ లో పాల్గొనుటకు ఆసక్తిగల టీములు అక్టోబర్ 31వ తేదీ లోగా తమ టీం ఎంట్రీలను ఎస్ కే సలీం, కన్వీనర్, నెహ్రు కప్, క్రికెట్ గ్రౌండ్ ఎదురుగా భద్రాచలం 9440101108 పంపించాలని సూచించారు. ఈ ఏడాది 30వ సంవత్సరం టోర్నమెంట్ నిర్వహిస్తున్న నేపథ్యంలో అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ కు గౌరవ చైర్మన్ గా పాకాల దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా ఎస్కే అజీమ్, గౌరవ సలహాదారులుగా ఉడతా రమేష్, టోర్నమెంట్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా అట్లూరి శ్రీధర్, కన్వీనర్ గా ఎస్కే సలీం, కార్యదర్శిగా ఎం నాగార్జున, కోశాధికారిగా కుంచాల సదానందం (సిద్దు), ఉపాధ్యక్షులుగా గుమ్ములూరి శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, సహాయ కార్యదర్శులుగా పూనెం ప్రదీప్ కుమార్, ఆనంద్ పాల్, కుప్పాల తేజలు వ్యవహరిస్తారని వెల్లడించారు.

## ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలి.

- ఐటిడిఏ పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట.

భద్రాచలం అక్టోబర్ 12 మన మీ వార్త:



తేదీ 12 అక్టోబర్ 26 సోమవారం భద్రాచలం ఐ టి డి ఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదివారం నాడు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని వారు తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరాలలో తప్పకుండా హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

## సింగరేణి మండల వాసికి ఆప్టోమెట్రీ లో గోల్డ్ మెడల్

- కష్టాలు అధికమించి కంటి వైద్య నిపుణుడు.

కారేపల్లి అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:




సింగరేణి మండలవాసి కారేపల్లి గ్రామానికి చెందిన యువకుడు అఖీల్ ఖాన్ బీఎస్సీ ఆప్టోమెట్రీ లో గోల్డ్ మెడల్ సాధించారు. డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, విజయవాడకు అనుబంధమైన రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో శనివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే లో ఆప్టోమెట్రిస్ట్ (కంటి విద్యా నిపుణుడు) గా ఉత్తమ ప్రతిభ చూపి ప్రముఖుల చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. చదువులలో చిన్నతనం నుండి చురుకుగా ఉండే మహమ్మద్ అఖిల్ ఉల్లా ఖాన్ జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఉచిత సీటు పొంది తన గ్రాడ్యుయేషన్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. కష్టాలు దాటి కంటి వైద్య నిపుణుడయ్యాడు కుమారుడికి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న తండ్రి మహమ్మద్ ఖలీల్ ఉల్లా ఖాన్ తీవ్రమైన రోడ్డు ప్రమాదానికి గురైనాడు. తల్లి రషీద కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయకుంటే ఉండలేని పరిస్థితి. ఇంతటి తీవ్ర ఇబ్బందుల్లోనూ తన తల్లిదండ్రులను కాపాడుకుంటూ, చెల్లెలైన రిషా బాధ్యతలను చూసుకుంటూ, మరోవైపు చదువును విజయవంతంగా పూర్తి చేసిన అఖీల్ ఖాన్ ఈ ఘనత సాధించారు. చదువులలో గోల్డ్ మెడలో సాధించిన అఖీల్ ఖాన్ కంటి వైద్య నిపుణుడిగా మేము సమాజానికి గొప్ప సేవలను అందించాలని తమ కోరికని తల్లిదండ్రులు ఖలిలుల్లా ఖాన్ - రసీదా లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## సింగరేణి మండల వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం.



కారేపల్లి అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:

సింగరేణి మండల వ్యాప్తంగా ఆదివారం ఆలయాల్లో విజయదశమి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాదారం రామాలయం కారేపల్లి విజయ విఘ్నేశ్వర శివాలయాల్లో లో పరిసరాలు భక్తి వాతావరణంతో కళకళలాడాయి. గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు, పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.గ్రామస్తులు, దాతలు తమ వంతు సహకారం అందించడంతో ఉత్సవాలు సజావుగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని, పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయి. గ్రామ పెద్దలు, యువత, చిన్నారులు కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విజయదశమి నవరాత్రి మహోత్సవాలు, బతుకమ్మ సంబరాలతో కారేపల్లి మాదారం పేరుపల్లి గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు, గ్రామస్తుల సందడితో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# చర్ల ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి.

- నాలుగేళ్లుగా తక్కువ వేతనాలు.. నిధుల కోతలు లేకుండా చట్టబద్ధ ప్రయోజనాలు కల్పించాలి.

- కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి -- ఎస్పీఎస్ వైద్య, ఆరోగ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దెల తిరుమలరావు.

చర్ల అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:



చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో దశాబ్ద కాలంగా పారిశుద్ధ్య, రోగుల సంరక్షణ, భద్రతా సిబ్బంది, పర్యవేక్షకులుగా పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీఎస్ వైద్య, ఆరోగ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు సిద్దెల తిరుమలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు ఆదివారం చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, సంఘం రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి ఉబ్బ రమతో కలిసి మాట్లాడారు.

2022లో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో జారీ చేసిన జీవో నంబరు 60 ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, రోగుల సంరక్షణ సిబ్బంది, భద్రతా సిబ్బంది, పర్యవేక్షకులకు కనీస వేతనంగా రూ.15,600 నిర్ణయించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం భవిష్య నిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకానికి సంబంధించిన మొత్తాలు మినహాయించిన తరువాత చెల్లించాల్సిన వేతనానికి బదులుగా, గత నాలుగేళ్లుగా కార్మికులకు నెలకు కేవలం రూ.11 వేలే చెల్లిస్తున్నారని ఆరోపించారు.

కార్మికులకు చట్టప్రకారం చెల్లించాల్సిన భవిష్య నిధి మొత్తాలను జమ చేయడం లేదని, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం ప్రయోజనాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీమా కార్డులు సైతం అందించకపోవడంతో కార్మికులు ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణకు సంబంధించిన ప్రయోజనాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని తిరుమలరావు డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి నెలకు రూ.26 వేల స్థిర వేతనం చెల్లించాలని కోరారు. భవిష్య నిధిలో కార్మికుడి వాటాను నిబంధనల ప్రకారం మినహాయించి, యాజమాన్యం చెల్లించాల్సిన వాటాను ప్రభుత్వం లేదా సంబంధిత యాజమాన్యం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం.**

ఎస్పీఎస్ వైద్య, ఆరోగ్య కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్కా నరేష్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్వతి, చంద్రకళ, అనురాధ, రూపలత, త్రివేణి, సతీష్, హేమంత్, భాగ్యశ్రీ, వెంకటేష్, శాంభవి, విష్ణు బాబు, సందీప్, దయాకుమార్, బి. మహేష్, పి. మహేష్ కుమారి, భారతి తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గ అమ్మవారి 12వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ.

- విగ్రహ దాత మొరిమేకల క్రాంతి--మనిషా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.

ఖమ్మం అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:



కొత్తగూడెం గ్రామంలోని 15వ డివిజన్, సీపీఎం ఆఫీస్ బజార్‌లో కనకదుర్గ అమ్మవారి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ దాత మొరిమేకల క్రాంతి--మనిషా ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సౌభాగ్యం, ఐక్యత వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాంతంలో భక్తి భావం వెల్లివిరియగా, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, పరస్పర స్నేహసంబంధాలను బలోపేతం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. కనకదుర్గ అమ్మవారి 12వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం భక్తి, ఐక్యత, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచింది. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తూ ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుక స్థానికంగా ఆధ్యాత్మిక సందడిని నెలకొల్పింది. కనకదుర్గ అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షించారు. మొత్తంగా, కనకదుర్గ అమ్మవారి 12వ వార్షికోత్సవం భక్తి, సంప్రదాయం, సేవాభావం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతూ ప్రజల మధ్య స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేయాలని స్థానికులు ఆకాంక్షించారు. పొందారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఆఫీస్ టీం సభ్యులు, గ్రామ ప్రజలు, బంధుమిత్రులు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు.





- తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి.

ఖమ్మం, తిరుమలాయపాలెం అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి తెట్టెలపాడు గ్రామంలో తెట్టెలపాడు నుండి బీరోలు ఆర్ అండ్ బి రోడ్డు వరకు 6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు శంఖుస్థాపన, సుబ్లేడ్ గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇది ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన ఇందిరమ్మ ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం పేదవాళ్ళకి మంచి చేయాలని, పేదవాళ్ళకి అండదండలుగాఉండాలని, పేదవాడి కుటుంబం కూడా చిరునవ్వులతో ఎప్పుడూ జీవించాలని అనేక సంక్షేమ కార్యక్రమాలను ఈ 33 నెలల్లో మీ గుమ్మానికి చేర్చిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్‌గా క్వింటాలుకు 500 రూపాయలు, ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డుతో పాటు, పెద్దోళ్ళు తినే సన్నబియ్యం బువ్వ నా పేదెంటి ఆడబిడ్డ తినాలని సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకి కోటి మందిని కోటీశ్వరులను చేయాలని, ఈ 33 నెలల్లోనే 72,000 కోట్ల రూపాయలు సున్నా వడ్డీకి ఇచ్చే కార్యక్రమం అమలు చేశామన్నారు. పెద్దోళ్ళ పిల్లలు చదివే స్కూళ్లకు దీటుగా ఇంటర్నేషనల్ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పేద పిల్లలు చదివే స్కూళ్లలో 40 శాతం డైట్ ఛార్జీలు, ఆడపిల్లలకు కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు ఇచ్చామని, రెండో విడత రెండున్నర లక్షల ఇళ్లు ఇస్తూ, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు, రమారమి అన్నీ కలిపి 8 లక్షల ఇళ్లు, 40 వేల కోట్ల రూపాయలు రెండు విడతల్లో నిరుపేద కుటుంబాలకి ఇల్లు కట్టించాలనే తాపత్రయంతో ఈ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రెండుసార్లు ఇళ్లు ఇచ్చాం, మా దగ్గర డబ్బులు అయిపోయినాయి, ఇక ఇవ్వము అనేది లేదని, మూడోసారి, నాలుగోసారి ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవాళ్లకి నాలుగు విడతల్లో 5 లక్షల రూపాయలు ఉచితంగా ఇచ్చేది ఈ ఇందిరమ్మ ప్రభుత్వమే నని మంత్రి స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు, ఏ పార్టీ అని, ఏ కులమని, ఏ మతమని అడగమని, చివరికి ఇల్లు ఇస్తే రేపు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తావా అని కూడా అడగమని అన్నారు.ఒక్క ఇళ్ల కార్యక్రమే కాదు, పేదవాళ్ళ పక్షపాతంగా ఇంకా రాబోయే కొన్ని రోజుల్లో చెప్పిన ప్రతి మాటని పేదింటి ఆడబిడ్డకి ఈ ప్రభుత్వం నెరవేర్చుతుందని మంత్రి అన్నారు. ఆసరా పెన్షన్ కానీ, పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వాల్సినవి వందకు వంద శాతం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డబ్బుని పేదింటి ఆడబిడ్డలకి పంచుతామని మంత్రి అన్నారు.ఎల్నినో ప్రభావం ఒక్క తెలంగాణ రాష్ట్రానికో, భారతదేశానికో కాదని, ప్రపంచవ్యాప్తంగా రాబోయే కొద్ది నెలలు కరెంటుతో పాటు నీటి తాగునీరు సమస్య కూడా రాబోతుందన్నారు. రైతన్నలు మొదటి పంట వేసుకున్నారని, ఎంత ఖరీదైనా కరెంటును కొని వేసిన పంటను నష్టపోకుండా, ఎండిపోకుండా కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. రెండో పంట వేయడానికి నీళ్లు లేవని, 15 రూపాయలకు యూనిట్ చొప్పున కొందామన్న కరెంటు దొరకటం లేదని తెలిపారు. రైతన్నలు అర్థం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా రెండో పంటను వేయొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న పంటని ఏది ఏమైనా పండించే కార్యక్రమం చేస్తామని, రెండో పంట వేసి కరెంటు లేక, నీళ్లు లేక రైతన్నలు ఇబ్బంది పడొద్దని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీఆర్డీవో శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, సర్పంచ్ లు నర్సమ్మ, స్వాతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే జూన్ కల్లా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలి.





- పొన్నెకల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

**ఖమ్మం అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**

వచ్చే జూన్ కల్లా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పరిశీలించారు. నిర్మాణాల్లో 4 ఆకాడమిక్ బ్లాకుల్లో ఒక బ్లాక్ స్లాబ్ లెవల్, రెండు బ్లాకులు బేస్మెంట్ స్థాయిలో ఉండగా, ఒక బ్లాక్ పనులు ఇంకనూ ప్రారంభించలేదని అన్నారు.సీనియర్ హాస్టళ్లు 9 లో, ఒక హాస్టళ్లు జి ప్లస్ 1 స్లాబ్ పూర్తవగా, 5 హాస్టళ్ల నిర్మాణాలు బేస్ మెంట్ వరకు జరిగాయని, 3 హాస్టళ్లు ఇంకా పనులు ప్రారంభం కాలేదని అన్నారు. కిచెన్, డైనింగ్ హాల్ నిర్మాణాలు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎక్కడ ఆలస్యం అలసత్వం ఉండకూడదని గుత్తేదారులకు, అధికారులకు తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల పనులను మరింత వేగవంతం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. నిర్మాణ కార్మికుల సంఖ్యను పెంచుకుని, పనులను మరింత వేగవంతం చేసి, జూన్ కల్లా పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలను మంత్రి పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్ లో జరుగుతున్న నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కుతుందని, ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందని మంత్రి అన్నారు. అక్షరమే ఆయుధంగా మలుచుకొని తెలంగాణ బిడ్డలు చదువుకొని బాగా ఎదగాలన్నారు. అక్షరం ద్వారానే అంతరాలు లేని సమాజ నిర్మాణం అవుతుందన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అందరూ ఒకేచోట చదువుకోవాలని లక్ష్యంతోనే ఈ పాఠశాలలను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఒకే చోట విద్యను అభ్యసిస్తే వసుదైక కుటుంబ భావన అందరిలోనూ ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, ఆర్ అండ్ ఎస్ ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయెశీదర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పూలవనంలో చిగురించిన ఆశల బతుకమ్మ

- ఖమ్మంలో తలసేమియా చిన్నారుల హృదయాలను హత్తుకునే వేడుకలు.
- రక్తదాతలే మా ప్రాణదాతలు బంగారు బతుకునివ్వమ్మా గౌరమ్మ.

**ఖమ్మం అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**





బతుకమ్మా బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకు ఇవ్వమ్మా ఉయ్యాలో ఆ పసి గొంతుకల నుంచి వెలువడిన ఈ ఆర్తనాదం, ఆనంద కేకలు ఆ ప్రాంగణాన్ని ఒక దివ్యమైన పూల వనంగా మార్చేశాయి. రోజూ మందు బిళ్లలు, సూదిమందుల నడుమ పోరాడే ఆ చిన్నారి ప్రాణాలు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకైన బతుకమ్మ పండుగ వేళ ఒక్కసారిగా ఉత్సాహంతో ఉప్పొంగాయి. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైరా రోడ్డులోని రితన్య ఆసుపత్రి ప్రాంగణం నాడు సరికొత్త శోభను సంతరించుకుంది. తలసేమియా మహమ్మారితో పోరాడుతున్న చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి స్వయంగా రంగురంగుల పూలను సేకరించారు. తమ చిన్నారి చేతులతోనే ఎంతో శ్రద్ధగా, భక్తిశ్రద్ధలతో ఒక భారీ బతుకమ్మను తీర్చిదిద్దారు. సాంప్రదాయ దుస్తుల్లో ముద్దుముద్దుగా తయారై వచ్చిన ఆ చిన్నారుల ముఖాల్లోని చిరునవ్వులు అందరినీ కంటతడి పెట్టించాయి. గౌరమ్మకు, బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, వారు వలయాకారంగా తిరుగుతూ ఆడిపాడిన తీరు అందరి హృదయాలను హత్తుకుంది. ఈ వేడుకల్లో చిన్నారులు చేసిన వేడుక కేవలం ఆటపాటలకే పరిమితం కాలేదు; తమకు ప్రతి నెలా ప్రాణం పోస్తున్న రక్తదాతలను తలుచుకుంటూ వారు భావోద్వేగానికి గురయ్యారు. “మాకు పునర్జన్మ ఇస్తున్న రక్తదాతలను, దేవుళ్లా ఆదుకుంటున్న మనుషులను ఎల్లప్పుడూ చల్లగా చూడమ్మా గౌరమ్మ” అంటూ ఆ చిన్నారులు వేడుకున్న తీరు అక్కడి వారందరి గొంతుకలను మూగబోయేలా చేసింది. ఈ మానవీయ వేడుకల్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ డి. నారాయణమూర్తి, సంస్థ ఫౌండర్ అనిత, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి పావని, పి. ఉదయభాస్కర్, పి. రవిచందర్ తదితరులు పాల్గొని చిన్నారులతో పాటు బతుకమ్మ ఆటలాడి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. పూల పండుగ తెచ్చిన ఈ సంతోషం ఆ చిన్నారుల జీవితాల్లో చిరకాలం నిలవాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు.

# వేదమంత్రోచ్చారణతో నదిహారతి.

- పులకించిన భక్తజనం.
- భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్.

**భద్రాచలం అక్టోబర్ 11 మన మీ వార్త:**



భద్రాచలం ప్రజలు భక్తుల ఆదరాభిమానాలతో గోదావరి మాత నదిహారతి పురోహితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని రామ వజ్జల రవికుమార్ అన్నారు. ఆదివారం సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో సాయంత్రం 6:30 గంటలకు జైశ్రీరామయ నమః అని శ్రీరామ స్మరణతో గోదావరి నదికి భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు. దేవి శరన్నవ రాత్ర మహోత్సవాలు ప్రారంభం కావడంతో లలితా పరమేశ్వరి మాతకు సైతం హారతి సమర్పించడం జరుగుతుందని, లోక కళ్యాణం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కోరుతూ నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవి మాత అనుగ్రహంతో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మరియు గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. అనంతరం పురోహితులు గోదావరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి పూజ, పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ జీనమః అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన అనంతరం ముందుగా సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన ఆనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, రవికుమార్ శర్మ లక్ష్మీ దంపతులు సమర్పించిన ప్రసాదం, నైవేద్యం, భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, నదిహారతి కార్యక్రమానికి పూజా సామాగ్రి భద్రాద్రి పురోహితుల సంఘం భద్రాచలం వారు అందించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు రవికుమార్ శర్మ, సత్య ప్రసాద్ శర్మ, రామాచార్యులు, తేజ శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ, తిరుపతిరావు, శివ, పి ఎస్ ఎన్ రెడ్డి మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భైరవుని పల్లి లో గుండపనేని కమలమ్మ గారి భౌతిక కాయానికి నివాళులు అర్పించిన తుంబూరు దయాకర్ రెడ్డి, కొడాలి గోవింద రావు.

**నేలకొండపల్లి అక్టోబర్ 10 మీ వార్త ఆర్ సి:**



నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి సర్పంచ్ గుండపనేని లక్ష్మణరావు మాతృమూర్తి కమలమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంఛార్జి తుంబూరు దయాకర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడవద్దని అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకన్న,కుక్కల హనుమంతరావు, చెరువు స్వర్ణ, జంగం లక్ష్మీనారాయణ, కొమ్మినేని విజయ్ బాబు, గండు సైదులు, మరికంటి రమేష్, గోళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కామేపల్లి లో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం.

- బాలత్రిపుర సుందరి దేవి రూపంలో అమ్మవారి దర్శనం.

**కామేపల్లి అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**





మండల కేంద్రమైన కామేపల్లి లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శ్రీ హరిహర గురు మందిరం,ఎంపీ సెంటర్ లో, రామకృష్ణాపురం అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు.మొదటి రోజున బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు,అభిషేకాలు నిర్వహించటంతో పాటు కుంకుమ పూజ హోమాలు నిర్వహించారు. అవధానాలు ఈ శరన్నవరాత్రి ఉత్సవాల విశిష్టతను వివరిస్తుండగా భక్తులు దేవి నామస్మరణతో మందిర ప్రాంగణాలు మార్మోగాయి.ఈ కార్యక్రమంలో భక్తమండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ, మహంకాళి రామ నర్సయ్య,దమ్మాలపాటి శివాజీ,నాగభూషణరావు, నాగుబండి హనుమంతరావు,కేశగాని నాగయ్య,కర్లపాటి రాజేంద్రప్రసాద్,గాదె సత్యనారాయణ,డాక్టర్ పూజల శివకృష్ణ, సతీష్, తోటరాము, మనోజ్ కుమార్, రవికుమార్, స్వర్ణ కుమార్, సతీష్,రాజేష్, సాయి కుమార్, కోటగిరి రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం.

**కరకగూడెం అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**



మండల పరిధిలోని బట్టుపల్లి పంచాయతీలో రాళ్లవాగు పెద్దమ్మ తల్లి గుడి వద్ద శ్రీ శ్రీ శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ఈరోజు ప్రారంభించడం జరిగినది. ఈరోజు అమ్మవారు భక్తులకి బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనం ఇవ్వడం జరుగుతుంది. పది రోజులపాటు అత్యంత వైభవంగా అమ్మవారు పలు రకాల అవతారాలలో దర్శనమిస్తూ భక్తులకు ఆశీస్సులు కలగజేస్తుంది. చివరి రోజున ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం, శమీ పూజ కార్యక్రమం,అమ్మవారి ఊరేగింపు, అమ్మవారి చీరల వేలం పాట వంటి పలు రకాల కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారిని కనులారా చూసే భాగ్యం దొరకడం భక్తులు అదృష్టంగా భావిస్తారు. రాళ్లవాగు పెద్దమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారి యొక్క విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని భక్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమం లో సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం.

- రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలి.
- కామేపల్లి ఏవో బి.తారా దేవి.

**కామేపల్లి అక్టోబర్ 11 మీ వార్త ప్రతినిధి:**



కామేపల్లి మండల పరిధిలోని కామేపల్లి, పాత లింగాల రైతు వేదికలలో సోమవారం ఉదయం 10 గంటల నుండి రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్న ట్లు మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి ఆదివారం తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ముఖ్యఅ తిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న యాసంగి సీజన్‌కు పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అనువైన పంటల ఎంపిక, పంటల సాగు,యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# దేశ విధానాలను బిలియనీర్‌లు నిర్దేశించలేరు..
# ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ కౌంటర్..!



భారతదేశానికి ప్రధాని అంబానీ నా అంటూ టెస్లా స్పేస్ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ కౌంటర్‌కు నటి, ఎంపీ కంగనా రనౌత్ కూడా మద్దతు తెలిపారు. భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందించారు. భారత ప్రధాని అంబానీనా..? అంటూ సెటైరిక్‌గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. ఏ బిలియనీర్ అయినా, అది భారతీయుడైనా అమెరికన్ అయినా.. దేశ విధానాలను నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ హాసన్ విమర్శించారు. చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోందని అన్నారు. భారత్ కూడా అదేవిధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. భారత్ ఒక ప్రజాస్వామ్య దేశమని, వలసపాలిత ప్రాంతం (కాలనీ) కాదని వ్యాఖ్యానించారు. తాము ప్రపంచాన్ని స్వాగతిస్తామని, కానీ భారత ప్రజలుగా మా భవిష్యత్తును మేమే నిర్ణయించుకుంటామని కమల్ హాసన్ తన పోస్టులో స్పష్టంచేశారు. కమల్ పోస్టును షేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. కమల్ కౌంటర్ మస్క్‌కు బాగా తగిలి ఉంటుందని కంగనా తన పోస్టులో పేర్కొన్నారు. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదని కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారని ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసింది.




## గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి నాని.. సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' షూటింగ్ షురూ!

నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూనే మరోవైపు తన ప్రయోగాత్మక చిత్రాలతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఇటీవలే ఆయన నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ భారీ విజయం అందించిన జోరును ఏమాత్రం తగ్గించకుండా, నాని తన తదుపరి ప్రాజెక్ట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో నాని ఒక క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమయ్యారు. "బ్లడీ రోమియో" అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ మరియు గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. కేవలం యాక్షన్ హీరోగానే కాకుండా, ఒక వైవిధ్యమైన చెఫ్ పాత్రలోనూ, అలాగే మరోవైపు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గానూ ఆయన ద్విపాత్రాభినయం లేదా విభిన్న షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో అదరగొట్టనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## ఒక్కో సినిమాకు రూ.8 కోట్లు తీసుకుంటున్నానా .. ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ..!



సినిమా ఇండస్ట్రీలో ఒక భారీ విజయం అందుకున్న తర్వాత హీరోలు, హీరోయిన్ల పారితోషికాలపై రకరకాల వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీనటుల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. తాజాగా 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి శ్రీనిధి శెట్టి పారితోషికంపై ఇలాంటి ప్రచారమే తెరపైకి వచ్చింది. ఆమె ఒక్కో సినిమాకు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు తీసుకుంటున్నారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై స్పందించిన శ్రీనిధి శెట్టి అసలు విషయాన్ని వెల్లడించారు. శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ పారితోషికం గురించి జరుగుతున్న ప్రచారం ఆశ్చర్యంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కేవలం పుకార్ల ఆధారంగా ఇలాంటి వార్తలను నమ్మవద్దని సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునేటప్పుడు పారితోషికానికే ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనకు నచ్చిన కథ, అందులో తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం, సినిమా నాణ్యత వంటి అంశాలనే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటానని వెల్లడించారు. 'కేజీఎఫ్' చిత్రాలతో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వరుసగా ఎక్కువ సినిమాలు చేసుకుంటూ వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయలేదని శ్రీనిధి శెట్టి అభిప్రాయపడింది. డబ్బు సంపాదించడమే లక్ష్యమైతే ఆ సినిమా విజయాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని పేర్కొంది.

## ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు.. మృణాల్ ఠాకూర్ సీరియస్



సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, రూపురేఖలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి, 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ కూడా ఇదే అంశంపై ఘాటుగా స్పందించారు. కత్రినా కైఫ్, కృతి సనన్‌లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు.తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. వారి విజయాలను, కష్టాన్ని మరిచిపోయి చిన్న చిన్న విషయాలపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రతి అంశంలోనూ ఇతరులను తప్పుపట్టడం మానుకోవాలని, సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్టుగా అనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో ఆమె శారీరక రూపురేఖలపై కొందరు నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తల్లి అయిన తర్వాత శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఒక మహిళ శరీరంలో వచ్చే మార్పుల ఆధారంగా ఆమెను అంచనా వేయడం, బహిరంగంగా అవమానించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ ప్రకటనలో ధరించిన దుస్తుల కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా విడుదలైన ఓ నగల ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆ దుస్తులు పండుగ సందర్భానికి తగినవి కావంటూ విమర్శలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ వివాదం నేపథ్యంలో సదరు ప్రకటనను తొలగించారు.. తన ఉద్దేశం ఎవరి మనోభావాలను దెబ్బతీయడం కాదని కృతి సనన్ వివరణ ఇచ్చింది. కాగా, సామాజిక మాధ్యమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొంటున్నారని మృణాల్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అయితే మహిళల దుస్తులు, శరీరాకృతి, వ్యక్తిగత నిర్ణయాలపై తరచూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తుంది.



## ఢిల్లీ హైకోర్టులో విజయ్ దేవరకొండకు ఊరట.. వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తూ కోర్టు తీర్పు

నటుడు విజయ్ దేవరకొండకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, గొంతు మరియు ఇతర వ్యక్తిగత హక్కులను (ావతీంశీఅుశ్రీ్‌ఎ =అస్త్రష్ట్రం) అనధికారికంగా ఇతరులు వాడకుండా ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డీప్‌ఫేక్స్ మరియు ఫేస్-మార్ఫింగ్ టెక్నాలజీలను ఉపయోగించి ఆయనను అశ్లీల లేదా అసభ్యకర రీతిలో చిత్రీకరిస్తున్న కంటెంట్‌పై కోర్టు తీవ్రంగా స్పందించింది. న్యాయమూర్తి జస్టిస్ వికాస్ మహాజన్ ఈ ఆదేశాలు జారీ చేస్తూ.. మెటా (వీమ్ఖ), గూగుల్ ఎక్స్ (శ) వంటి సోషల్ మీడియా సంస్థలు నటుడు గుర్తించిన అక్రమ కంటెంట్, వీడియోలు, రీల్స్, పోస్టులు మరియు అకౌంట్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు సంబంధిత లింక్‌లను 72 గంటల్లోగా టేకడౌన్ చేయాలని స్పష్టం చేశారు. విజయ్ దేవరకొండ తన పేరు (విజయ్ దేవరకొండ, విజయ్ సాయి దేవరకొండ), 'ఎణ' అనే ఇనిషియల్స్, సిగ్నేచర్లు, వాయిస్ రికార్డింగ్‌లు, ఫ్యాషన్ స్టైల్, సినిమా స్టిల్స్ వంటి వాటిని వాణిజ్యపరంగా ఎవరూ దుర్వినియోగం చేయకుండా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయనకు ఎంతో ఇష్టమైన "రౌడీ" (=శీషసఎ) అనే పేరును కేవలం ఒంటరిగా వాడడంపై మాత్రం కోర్టు ఎక్స్-పార్టీ ఇంజంక్షన్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ పేరు ఆయనకు మాత్రమే ప్రత్యేకంగా చెందుతుందని నిరూపించే తగిన సాక్ష్యాధారాలు అవసరమని కోర్టు పేర్కొంది. అదే సమయంలో, "రౌడీ" అనే పదాన్ని విజయ్ ఏఐ లేదా మార్ఫ్ ఇమేజ్‌లతో కలిపి వాడితే మాత్రం అది ఆయన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను డిసెంబర్ 3కి మరియు తదుపరి విచారణను ఫిబ్రవరికి వాయిదా వేస్తూ, ప్రతివాదులు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



## 'ప్రేమద ఊరాలి' సంచలనం

## రూ.2 కోట్ల బడ్జెట్‌తో సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్ల వసూళ్లు..

సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే మాటను మరోసారి నిజం చేస్తోంది కన్నడ చిత్రం 'ప్రేమద ఊరాలి'. విడుదలకు ముందు పెద్దగా అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ ప్రచారం, స్టార్ హీరోలు, భారీ బడ్జెట్ లేకుండానే కేవలం కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్లలో దూసుకుపోతోంది. కేవలం రూ. 2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలోనే కర్ణాటకలో రూ. 50 కోట్ల వసూళ్ల మార్కును అందుకోనుందని ట్రేడ్ వర్గాల అంచనా. 'ప్రేమద ఊరాలి' సినిమా విడుదలైన తొలిరోజుల్లో బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు లేకపోవడంతో మొదట్లో వసూళ్లు కూడా నెమ్మదిగానే సాగాయి. అయితే సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మౌత్ టాక్ బలపడటంతో రోజురోజుకూ థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకు అండగా నిలుస్తుండటం విశేషం. కథలోని భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల చుట్టూ సాగే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో తొలి రోజుల్లో నెమ్మదిగా సాగిన వసూళ్లు క్రమంగా పుంజుకుని ఇప్పుడు భారీ స్థాయికి చేరుకుంటున్నాయి. 'ప్రేమద ఊరాలి' ఒక సాధారణమైన కథను గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం. కుటుంబ సంబంధాలు, మనుషుల మధ్య అనుబంధాలు, భావోద్వేగాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. భారీ యాక్షన్ సన్నివేశాలు లేదా అద్భుతమైన విజువల్ హంగుల కంటే కథలోని సహజత్వం, పాత్రల మధ్య భావోద్వేగాలే సినిమాకు ప్రధాన బలంగా నిలిచినట్లు తెలుస్తోంది. ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి భారీ బడ్జెట్ తప్పనిసరి కాదని, మంచి కథతోనూ విజయాన్ని అందుకోవచ్చని ఈ సినిమా నిరూపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కుటుంబమంతా కలిసి చూసే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో 'ప్రేమద ఊరాలి' విజయ ప్రయాణం మరోసారి చాటిచెబుతోంది. ఈ సినిమా వసూళ్ల గురించి చర్చ జరుగుతున్న సమయంలో అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం దాని నిర్మాణ వ్యయం. 'ప్రేమద ఊరాలి' కేవలం రూ. 2 కోట్ల బడ్జెట్‌తో రూపొందినట్లు సమాచారం. అలాంటి చిన్న బడ్జెట్ చిత్రానికి రూ. 50 కోట్ల వసూళ్లు సాధించే స్థాయిలో ఆదరణ లభించడం విశేషంగా మారింది.